సాక్షి విశాఖపట్నం

బుధవారం | 25 | జనవరి | 2023



ఆలస్యంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష? 8లో

పీలానగర్ డిజిటల్ అయాన్ పరీక్ష కేంద్రంలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి.



షిప్‌యార్డ్‌లో డిఫెన్స్ సర్వీసెస్ అధికారులు 8లో

డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ అధికారులు మంగళవారం షిప్‌యార్డ్‌ను సందర్శించారు.



క్రికెట్ టోర్నీ నిర్వహణ అభినందనీయం 8లో

'సాక్షి' మీడియా ఏటా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు.

అంచనాల్లోనే అవినీతి?

- జీవీఎంసీ తాజా టెండర్లలో లోగుట్టు
- బ్లీచింగ్ పౌడర్, గ్లౌజులు కొనుగోళ్లల్లో జరిగిందిదే..
- పబ్లిక్ హెల్త్, మెకానికల్ విభాగాలపై ఆరోపణలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

మార్కెట్‌లో కిలో బ్లీచింగ్ పౌడర్ ధర రూ.12 నుంచి రూ.20 వరకు ఉంటుంది. ఒక వేళ లక్ష కిలోల బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయాలంటే ఈ ధర మరింత తగ్గుతుంది. ఇది సామాన్యులకు కూడా తెలిసిందే. అయితే ఘనత వహించిన జీవీఎంసీ అధికారులు మాత్రం కిలో ధర రూ.34 అంటూ అంచనాలు రూపొందించి టెండర్లను పిలిచారు.

జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది వినియోగించే చేతి గ్లౌజులు కూడా ఒక జత రూ.30 నుంచి రూ.40 వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సుమారు 33 వేలకుపైగా గ్లౌజులు కొనుగోలు చేయాల్సిన జీవీఎంసీ.. ఒక్కో జత గ్లౌజుకు వేసిన అంచనా ధర ఎంతో తెలుసా? ఏకంగా రూ.79.

జీవీఎంసీ సామగ్రి కొనుగోలు కోసం వేస్తున్న అనేక అంచనాల్లోనూ ఇవే తరహాలో ధరలు ఉన్నాయి. తీరా టెండర్లు పిలిచిన తర్వాత కొన్నింటికి అంచనా ధరలో సగం కంటే తక్కువ ధరకే సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. అది కూడా రెండుసార్లు రివర్స్ బిడ్డింగ్ చేపట్టిన అనంతరమే తుది ధర తేలింది. ఈ ధర కూడా మార్కెట్ ధర కంటే ఎక్కువగానే ఉంటోందన్న ఆరోపణలు వస్తున్నాయి. అయినప్పటికీ అంచనా కంటే చాలా తక్కువ ధరకే టెండర్లను ఖరారు చేశామంటూ జీవీఎంసీ అధికారులు గొప్పలు పోవడం గమనార్హం. కనీసం మార్కెట్ ధర తెలియకుండా అంచనాలు రూపొందిస్తున్న అధికారుల వ్యవహారంపై జీవీఎంసీ కమిషనర్ ఇప్పటికే ఓ కన్నేసి ఉంచినట్టు తెలుస్తోంది.

వస్తువు	అంచనా ధర	ఖరారైన ధర (రూ.ల్లో)
చేతి గ్లౌజులు	79	38.44
వెదురు కర్రలు	40	29.12
గడ్డ పారలు	560	344.06
బ్లీచింగ్ పౌడర్(కిలో)	34	17.41

పబ్లిక్ హెల్త్, మెకానికల్ మధ్య లింకులు

జీవీఎంసీ సిబ్బంది కోసం గ్లౌజులు, చేతిపారలు, లైఫ్‌బాయ్ సబ్బులు, బ్లీచింగ్ పౌడర్, సేఫ్టీ జాకెట్లు.. తదితరవి కొనుగోలు చేసేందుకు సమాయత్తమైంది. వాస్తవానికి ఇదంతా పబ్లిక్ హెల్త్ విభాగానికి సంబంధించిన వ్యవహారం. టెండర్లు పిలిచేందుకు ఈ విభాగానికి అవసరమైన సంపత్తి లేకపోవడంతో.. ఈ వ్యవహారాన్ని జీవీఎంసీలోని మెకానికల్ విభాగం చూస్తోంది. తమకు ఏమేమీ కావాలో పబ్లిక్ హెల్త్ అధికారులు పంపిన సమాచారం ఆధారంగా మెకానికల్ విభాగం అధికారులు టెండర్లను పిలుస్తారు. అయితే.. అంచనాలు మాత్రం పబ్లిక్ హెల్త్ అధికారులే రూపొందిస్తున్నారని మెకానికల్ విభాగం అధికారులు అంటున్నారు. తమకేమీ తెలియదని.. అంతా మెకానికల్ విభాగం అధికారులే చూసుకుంటారని పబ్లిక్ హెల్త్ అధికారులు పేర్కొంటున్నారు. వాస్తవానికి ఇరు విభాగాల అధికారులు కలిసే ఈ మొత్తం వ్యవహారాన్ని నడుపుతున్నట్టు తెలుస్తోంది. సమస్య వస్తే వారు మీద వీరు.. వీరి మీద వారు చెప్పుకోవడం మినహా లోగుట్టు వ్యవహారాల్లో ఇద్దరూ కలిసే కథ నడుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తక్కువ ధర అంటూ..!

టెండర్లను పిలిచే సమయంలోనే భారీగా అంచనాలు రూపొందిస్తున్నారు. తద్వారా టెండరు ఖరారు తర్వాత దీని కంటే తక్కువ ధరకే సరఫరా చేసేందుకు కాంట్రాక్టు సంస్థలు ముందుకొస్తున్నాయి. ఒక్కో సమయంలో అంచనాలో 50 శాతం కంటే తక్కువ ధరకే సరఫరా చేసేందుకు టెండర్లు దాఖలవుతున్నాయి. తద్వారా భారీగా జీవీఎంసీకి ఆదాయం మిగిలిందనే రీతిలో ప్రచారం చేసుకుంటున్నారు. వాస్తవంగా మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకే అంతిమంగా టెండరును ఖరారు చేస్తున్నారు. అయినప్పటికీ తమ అంచనాల కంటే టెండరు ధర భారీగా తక్కువగా ఉందని పేర్కొంటూ... జీవీఎంసీ ఖజానాకు ఆదా చేశామని అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. లోగుట్టులో మాత్రం అంచనాల్లోనే అవినీతికి పాల్పడుతూ.. కాంట్రాక్టు సంస్థలకు లబ్ధి చేకూరుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెట్ ధరను తెలుసుకున్న తర్వాత ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తుండటంతో దాని కంటే తక్కువ ధరకే అంచనాలను రూపొందించడం పరిపాటి. ఇందుకు భిన్నంగా జీవీఎంసీ అధికారులు చేస్తుండటమే అనుమానాలకు తావిస్తోంది. ఉదాహరణకు చేతి గ్లౌజుల ధరను జీవీఎంసీ రూ.79 మేర అంచనాలతో టెండర్లను పిలిచింది. మొదటి సారి టెండర్లను తెరిస్తే రూ.51.27కు సరఫరాకు ముందుకు రాగా.. రెండోసారి ఈ ధరతో టెండర్లను పిలిస్తే చివరకు రూ.38.44 ఖరారైంది. అంటే అంచనాలో సగం కంటే తక్కువ ధర. ఇలా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా అధిక అంచనాలతో టెండర్లను చేపడుతున్న జీవీఎంసీ సిబ్బందిపై ఉన్నతాధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చూడాలి!

విచారణ చేపడతాం



జీవీఎంసీ సిబ్బందికి అవసరమైన పరికరాలను కొనుగోలు చేయడంలో గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వారికి అవసరమైన రక్షణ పరికరాలతో పాటు శుభ్రత కోసం అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని నిర్ణయించాం. వీటి టెండర్లల్లో అధిక అంచనాల వ్యవహారాన్ని పరిశీలిస్తాం. దీనిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

రిజర్వేషన్ చార్జీ రూ.5లే!

- రూ.20 నుంచి 5కి తగ్గింపు
- ఇచ్ఛాపురం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులకు వర్తింపు



సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త! విశాఖపట్నం నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్లే, వచ్చే ప్రయాణికులకు ముందస్తు రిజర్వేషన్ చార్జీని తగ్గించారు. ప్రస్తుతం టికెట్ రిజర్వేషన్ చార్జీ కింద రూ.20 వసూలు చేస్తున్నారు. దానిని ఇప్పుడు రూ.5కి కుదించారు. విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ నుంచి నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం వైపు రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రతి గంటకు అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఇంద్ర సర్వీసులను నడుపుతున్నారు. ఈ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉంది. ఇకపై ఈ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ చేయించుకోదలచుకున్న వారి నుంచి రూ.20కి బదులు రూ.5 మాత్రమే వసూలు చేయనున్నారు. పలాస, ఇచ్ఛాపురం ప్లాట్‌ఫారం సమీపంలో రిజర్వేషన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. విశాఖలో మద్దిలపాలెం, ఇసుకతోట, హనుమంతవాక, మధురవాడ కార్‌షెడ్, మారికవలసల్లో పికప్ పాయింట్ సదుపాయాన్ని కల్పించారు. నేరుగా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేయించుకునే వీలుందని, దీనివల్ల సమయం ఆదా అవుతుందని, తగ్గించిన రిజర్వేషన్ చార్జీ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆర్టీసీ విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు కోరారు. అలాగే రానుపోను టికెట్టు ఒకేసారి బుక్ చేసుకున్న వారికి తిరుగు ప్రయాణపు చార్జీలో 10 శాతం తగ్గింపు ఉంటుందని తెలిపారు.

న్యూస్‌రీల్

28న నగరానికి సీఎం జగన్



ఏయూక్యాంపస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 28న నగరానికి రానున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా చినముషిడివాడలోని శ్రీ శారదా పీఠానికి ఉదయం 11 గంటలకు చేరుకుని, వార్షికోత్సవ కార్యక్రమాలలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు శారదా పీఠం నుంచి బయలు దేరి అక్కయ్యపాలెం సాగరమాల కన్వెన్షన్ హాల్‌లు చేరుకుంటారు. అనకాపల్లి ఎంపీ బి.సత్యవతి కుమారుడు డాక్టర్ యశ్వంత్, డాక్టర్ శ్రవంతి దంపతులను ఆశీర్వదిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు రుషికొండ ఐటీ పార్క్ వద్ద గల విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ నివాసానికి వెళతారు. ఎంపీ కుమారుడు శరత్ చౌదరి, జ్ఞానిత దంపతులకు శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదిస్తారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 1.55 గంటలకు ఐపీఎస్ అధికారి విద్యాసాగర్ నాయుడు, భవ్య దంపతులను వారి నివాసంలో ఆశీర్వదిస్తారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 2.05 గంటలకు బయలుదేరి 2.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2.45 గంటలకు విమానాశ్రయం నుంచి గన్నవరం విమానాశ్రయానికి పయనమవుతారు.

సాక్షి ఆధ్వర్యంలో నేడు బీచ్ క్లీనింగ్

మహారాణిపేట : సాక్షి మీడియా గ్రూప్, ప్రకృతి ప్రేమికులు, సామాజిక సేవకుల సహకారంతో ఈనెల 25న ఉదయం 6 గంటలకు తెన్నేటి పార్కు వద్ద బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, నగర పోలీసు కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

నేడు ఎంఐజీ ప్లాట్లకు లాటరీ

దొండపర్తి(విశాఖ దక్షిణ): జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్స్ పథకంలో భాగంగా పాలవలసలో అభివృద్ధి చేసిన ఎంఐజీ ప్లాట్లకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు గురజాడ కళాక్షేత్రంలో ఈ–లాటరీ ద్వారా కేటాయింపులు చేయనున్నారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మెట్రోపాలిటన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను నిర్వహించనున్నారు.

కేకేలైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): భద్రతాకారణాల దృష్ట్యా కేకే లైన్‌లో నడిచే పలు రైళ్ల గమ్యం కుదింపు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈనెల 25,26 తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 26,27 తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం(18513)ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుండి విశాఖపట్నం చేరుకుంటుంది. ఆయా తేదీల్లో దంతేవాడ–కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు. అలాగే ఈనెల 25,26 తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 26, 27 తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం(08552)పాసింజర్ రైలు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఆయా తేదీలలో ఈ రైళ్లు దంతేవాడ–కిరండూల్ మధ్య రాకపోకలు సాగించవు.

న్యాయవాదుల సంఘం ఎన్నికలకు ఆదేశం

విశాఖలీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికలు ఫిబ్రవరి 24వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం విశాఖ న్యాయవాదుల సంఘానికి ఆమె ఆదేశాలు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2022 –23 ఏడాదికి ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. ఫిబ్రవరి 16న నామినేషన్ల స్వీకరణ, 21న పరిశీలన, ఉపసంహరణ, 23న తుది జాబితా ప్రకటించాలి. అలాగే 24న ఎన్నికలు నిర్వహించి అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కించి విజేతలను ప్రకటించాలని తెలిపారు.

ఎన్నికల నిర్వహణ సాధ్యంకాదు: అధ్యక్షుడు వైద్యుల రవీంద్రప్రసాద్

బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రవీంద్ర ప్రసాద్ స్పష్టం చేశారు. మార్చి 31లోపు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి బార్ కౌన్సిల్ అధికారులతో చర్చిస్తామన్నారు. పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

28 నుంచి నేషనల్ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ నగరంలో నేషనల్ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం (ఎన్.వై.కే) జిల్లా అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో మూడు రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీయువకులు పాల్గొంటారని చెప్పారు. మంగళవారం యూత్ హాస్టల్‌లో ఆయన మాట్లాడారు. రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ ప్రాంగణంలో వారం రోజులపాటు జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ఒడిశా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. సీఆర్పీఎఫ్, ఐడీబీపీ, బీఎస్ఎఫ్ ప్రతినిధులు యువతకు సహకారంగా వస్తున్నారని చెప్పారు. గిరిజన యువతకు సంబంధించిన భాష, సాంస్కృతిక, జీవన వ్యవహార శైలి, ఆర్థిక పరిస్థితులు, నివసించే పద్ధతులు, జీవన విధానంపై అవగాహన కల్పిస్తామని వివరించారు. 2020లో 12వ గిరిజన యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం విశాఖపట్నంలో నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. తిరిగి 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం నిర్వహించే అవకాశం విశాఖకు లభించిందని తెలిపారు. ఈ వారం రోజులు వివిధ అంశాలపై తర్ఫీదు, చర్చా గోష్ఠి, వక్తృత్వ పోటీలు, వివిధ రాష్ట్రాలకు సంబంధించిన గిరిజన సంప్రదాయలపై నృత్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. అదే విధంగా పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాల సందర్శన ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్.వై.కె.పరిపాలన అధికారి అల్లం రాంప్రసాద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆర్.లీలాప్రసాద్ పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

నేషనల్ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం పోస్టర్‌ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మిందిలోని తన స్వగృహంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్.వై.కె అధికారులను అభినందించారు. కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

కలెక్టర్ మల్లికార్జునకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు



కలెక్టర్ మల్లికార్జున అభినందిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి, చిత్రంలో జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఉత్తమ విధానాలు అవలంబించిన కలెక్టర్ ఎ.మల్లికార్జున బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు ఎంపికయ్యారు. విజయవాడలో బుధవారం జరగనున్న కార్యక్రమంలో గవర్నర్ చేతులమీదుగా ఆయన అవార్డు స్వీకరించనున్నారు. జిల్లా నుంచి గాజువాక ఎన్నికల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి ఉత్తమ ఎన్నికల నమోదు అధికారిగా, గాజువాక పోలింగ్ కేంద్రం నంబర్ 159 బూత్ లెవల్ అధికారి సునీత ఉత్తమ బూత్ లెవల్ అధికారిగా జాతీయ ఓటరు దినోత్సవంలో అవార్డులు స్వీకరించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, సమాచార శాఖ డీడీ వి.మణిరామ్, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది మంగళవారం కలెక్టర్ ఎ.మల్లికార్జునను ఆయన చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

టీడీపీలో లైంగిక వేధింపులు

- ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు
- పార్టీలో మహిళలకు రక్షణ లేకే రాజీనామా
- టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గోడి అరుణ



మధురవాడ (భీమిలి) : తెలుగుదేశం పార్టీలోని కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన ఓ నాయకుడు తనను లైంగికంగా వేధిస్తున్నాడని, అసభ్యకరంగా ప్రవరిస్తున్నాడని, ఆ విషయాన్ని పార్టీలోని కీలక నేతలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గోడి అరుణ వెల్లడించారు. విశాఖలోని మధురవాడకు చెందిన తాను పదేళ్ల నుంచి పార్టీకి సేవలందిస్తున్నానన్నారు. బీసీ మహిళా నాయకురాలినైన తనకే ఈ పరిస్థితి ఎదురైందని, టీడీపీలో మహిళలకే కాదు.. మహిళా నాయకురాళ్లకు కూడా రక్షణ కరువైందని పేర్కొన్నారు. మంగళవారం ఆమె మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీలో చురుగ్గా ఉంటున్న తనను కర్నూలుకు చెందిన నేత ఏడాది నుంచి లైంగికంగా వేధిస్తూ, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. ఆ నేత లైంగిక వేధింపులు తాళలేక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనితతోపాటు మరికొందరు ముఖ్య నాయకులకు పలుమార్లు ఫిర్యాదు చేశానని తెలిపారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదన్నారు. పైగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనిత, ఇతర నేతలు తనను వేధిస్తున్న వ్యక్తికే కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. టీడీపీలో ఈ నేతల వైఖరితో మనస్తాపం చెంది రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం అరుణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరోవైపు అరుణ పార్టీ నియమావళికి వ్యతిరేకంగా క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినందున ఆమెను పార్టీ పదవి నుంచి తొలగించినట్టు టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.

ఇన్సూరెన్స్ పేరుతో మహిళకు టోకరా

- రూ.3,19,470 కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు
- నైజీరియన్ ముఠాగా అనుమానం

దొండపర్తి(విశాఖ దక్షిణ): సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాలో ప్రజలను దోచుకుంటున్నారు. సాంకేతికత సహాయంతో రూ.లక్షలు కాజేస్తున్నారు. తాజాగా ఇన్సూరెన్స్ పేరుతో ఒక మహిళకు టోకరా వేశారు. ఏకంగా రూ.3,19,470 కొల్లగొట్టారు. వివరాల్లోకి వెళితే.. పురుషోత్తపురం ప్రాంతానికి చెందిన ఒక మహిళకు గత కొన్ని రోజులుగా మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. పాలసీ డ్యూ డేట్ దగ్గర పడిందని, వెంటనే డబ్బులు చెల్లించాలని సదరు మహిళను కాల్స్ చేస్తున్నారు. అయితే ఆ మహిళ వారి మాటలను ముందు నమ్మలేదు. ఒక రోజు ఆ మహిళను నమ్మించడానికి కస్టమర్ వివరాలైన ఆధార్, పాన్, చిరునామా, ఫోన్ నెంబర్ చెప్పడంతో ఆమె నమ్మింది. వారు చెప్పిన అకౌంట్‌కు రూ.3,19,470 ట్రాన్స్‌ఫర్ చేసింది. మరుసటి రోజు నుంచి మళ్లీ కాల్ చేస్తూ చెల్లించిన డబ్బులు నకిలీ అకౌంట్‌కు వెళ్లాయని, అవి పాలసీకి మారాలంటే ప్రతి లావాదేవీకి రూ.15 వేలు కట్టాలని చెప్పారు. దీంతో ఆమె దగ్గరలో ఉన్న మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్‌కి వెళ్లి సంప్రదించగా.. తాను మోసపోయినట్లు తెలుసుకుంది. వెంటనే ఆమె సైబర్ క్రైం పోలీసులకు ఆశ్రయించగా సీఐ భవాని ప్రసాద్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి తరహా నేరాలన్నీ ఢిల్లీ కేంద్రంలో నైజీరియన్ ముఠా ద్వారా జరుగుతున్నాయని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

28లోగా ఏపీఆర్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ఏయూక్యాంపస్ : ఏపీఆర్‌సెట్ 2022 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు ఈనెల 28లోగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ వెంట సర్టిఫికెట్లకు సంబంధించి రెండు జతల జెరాక్స్ ప్రతులను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఈనెల 26న రిపబ్లిక్ డే నాడు సెలవు అని, అభ్యర్థులు గమనించాలన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు శుభవార్త

- పదేళ్ల తరువాత పదోన్నతులు
- ఇద్దరికి కారుణ్య నియామకం కింద శాశ్వత ఉద్యోగాలు
- చైర్‌పర్సన్ కొండా రమాదేవికి ఉద్యోగులు కృతజ్ఞతలు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో రమాదేవి

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి శుభవార్త చెప్పారు. దాదాపు పదేళ్ల పాటు పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యను పరిష్కరించారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలపై కూడా ఉత్తర్వులు ఇచ్చి ఇద్దరికి శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం రామా టాకీస్ వద్ద గల జిల్లా గ్రంథాలయ సంస్థ కేంద్ర కార్యాలయంలో చైర్‌పర్సన్ రమాదేవి ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం పదోన్నతి, ఉద్యోగాలు పొందిన వారికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించిన చైర్‌పర్సన్ రమాదేవికి ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి(ఎఫ్‌ఏసీ) లలిత, ఇతర గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఏయూకు చినజీయర్ స్వామీజీ రాక



సుందరంగా తీర్చిదిద్దిన ఏయూ యోగా కేంద్రం



ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం

- ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శక్తిస్థూపానికి భూమిపూజ
- విద్యార్థులతో కలసి 108 ఔషధ మొక్కలు నాటనున్న స్వామీజీ

ఏయూ క్యాంపస్: విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని చినజీయర్ స్వామీ బుధవారం సందర్శించనున్నారు. ఏయూలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల హాస్టళ్ల మధ్య నూతనంగా అభివృద్ధి చేసిన 16 ఎకరాల క్రీడా మైదానాన్ని చినజీయర్ ప్రారంభిస్తారని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. దాతల సహాయంతో 9 నెలలు శ్రమించి తీర్చిదిద్దిన ఈ మైదానాన్ని విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ నిర్వాహకులు, ఏయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ పి.ఏసుపాదం, రాజారెడ్డి, రామకృష్ణ రాజు తమ సొంత ఖర్చులతో ఈ మైదానాన్ని అభివృద్ధి చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి 108 ఔషధ మొక్కలను మైదానం చుట్టూ నాటే కార్యక్రమంలో స్వామీజీ పాల్గొంటారు. భగవంతుడి ఆశీస్సులు అందరికీ చేరాలనే సత్సంకల్పంతో మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న శక్తిస్థూపం నిర్మాణానికి నిర్వహించే భూమిపూజలో చినజీయర్ పాల్గొంటారు. ఏయూ క్రీడా మైదానానికి ఉర్జ (సంస్కృతంలో శక్తి అని అర్థం) అని నామకరణం చేస్తారు. అనంతరం బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌ను స్వామీజీ సందర్శిస్తారు. వర్సిటీలో పలు ప్రాంతాల్లో ఔషధ మొక్కలు నాటడంపై సూచనలిస్తారు. ఏయూ కన్వెన్షన్‌సెంటర్‌లో విద్యార్థులనుద్దేశించి అనుగ్రహభాషణం చేస్తారు.

కాలుష్య నియంత్రణ ప్రతి పౌరుడి బాధ్యత

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు తదితరులు

అల్లిపురం(విశాఖ దక్షిణ): నగరంలో కాలుష్య నియంత్రణకు ప్రజలందరి సహకారం అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు మహ్మద్ సాధిక్‌తో కలసి కాలుష్య నియంత్రణకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో విపరీతంగా కాలుష్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ప్రత్యామ్నాయ వస్తువులు వాడాలని సూచించారు. రాజకీయపార్టీలు, స్వచ్ఛంద సంస్థలు వేడుకలు, శుభకార్యాలు, పండగలకు ప్లాస్టిక్ బ్యానర్లు వాడొద్దని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ పి.రాజాబాబు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ నివాసితుల సంక్షేమ సంఘాలు, ఎన్జీవోస్, నగర ప్రజలు సహకరించాలన్నారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులు ప్రతి ఇంటికీ వెళ్లి.. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పించాలన్నారు.

అధికారులు ఎప్పటికప్పుడు గెడ్డలను పరిశీలించి శుభ్రం చేయించాలన్నారు. ఇప్పటివరకు బీచ్ ప్రాంతంలో శుభ్రతపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించామని.. ఇకపై ప్రతి వీధిపైనా దృష్టి సారిస్తామన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యానర్లకు బదులు క్లాత్ బ్యానర్లు వాడతామన్నారు. కాలుష్య నియంత్రణ సభ్యుడు మహ్మద్ సాధిక్ మాట్లాడుతూ వాహనాల కాలుష్యం, నిషేధిత ప్లాస్టిక్ వాడకం మానవ మనుగడకే ప్రమాదమన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థలు తయారు చేసిన జ్యూట్ బ్యాగులను అతిథులు పరిశీలించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్.వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్జీ శాస్త్రి, జోనల్ కమిషనర్లు, ఏఎంవోహెచ్, ఏపీపీసీబీ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రాజేంద్రరెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎల్.వి.రమణి పాల్గొన్నారు.

ప్రజా గర్జనకు మంత్రి అమర్‌నాథ్‌కు ఆహ్వానం



మంత్రి అమర్‌నాథ్‌కు ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్మిక నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా అడ్డుకునేందుకు చేస్తున్న పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని, మద్దతు తెలపాలని రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు కోరారు. మిందిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన్ను కలిసి, మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 30న ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించ తలపెట్టిన ప్రజాగర్జన కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో మంత్రి రాజశేఖర్, జె.అయోధ్య రామ్, ఆదినారాయణ, బొడ్డు పైడిరాజు, కారు రమణ, వి. శ్రీనివాసరావు, సీరుకొండ రామచంద్ర రావు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

బ్లాక్‌మెయిలర్ మూర్తి యాదవ్

- కార్పొరేటర్‌ను సస్పెండ్ చేయాలని మేయర్‌ను కోరతాం
- 22వ వార్డులో రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు
- జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఫ్లోర్‌లీడర్ శ్రీనివాసరావు. చిత్రంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలాగైతే ప్యాకేజీ స్టారో.. ఆ పార్టీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కూడా అలాగే తయారయ్యారని వైఎస్సార్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ బానాల సత్య సూర్య శ్రీనివాసరావు ఆరోపించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలిసి ఫ్లోర్‌లీడర్ చాంబర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరుగుతుంటే.. తన వార్డులో అసలు పనులు జరగడం లేదంటూ మూర్తియాదవ్ నిరసనకు దిగడం సిగ్గుచేటన్నారు. జీవీఎంసీ ప్రాంగణంలో నిరసన చేపడితే.. అరెస్ట్ అయి మీడియాలో ప్రచారం లభిస్తుందనే దుర్బుద్ధితో ఇలాంటి పనికిమాలిన పనికి దిగారని దుయ్యబట్టారు. వార్డులో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదని, మేయర్, కమిషనర్, కౌన్సిల్ సభ్యులపై ఇష్టానుసారంగా ప్రేలాపనలు చేయడమే గాక, అధికారులను బెదిరించడం దుర్మార్గమన్నారు. ఆ వార్డుకు సంబంధించి రూ. 2.50 కోట్ల మేర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని.. ఇప్పటికే రూ.66 లక్షల పనులు పూర్తయ్యాయన్నారు. పెండింగ్ పనులు టెండర్ అయి ఉన్నాయని, పర్సంటేజీల కోసం కాంట్రాక్టర్‌ను మూర్తి యాదవ్ బెదిరిస్తుండడంతో ఆ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రూ.14 లక్షలతో టెన్నిస్ కోర్టు పూర్తయ్యిందని చెప్పారు. ఓ మోసగాడిని ఎన్నుకున్నామా.. అని ఆ వార్డు ప్రజలు సిగ్గుపడుతున్నారని, ఆయన నిరసనకు దిగితే తోటి జనసేన కార్పొరేటర్లు పట్టించుకోలేదన్నారు. అన్ని పార్టీల నాయకులతో కలిసి బ్లాక్‌మెయిలర్ పీతల మూర్తి యాదవ్‌ను కౌన్సిల్ నుంచి సస్పెండ్ చేయమని మేయర్‌ను కోరతామన్నారు. మూర్తి యాదవ్‌పై ఎన్నో కేసులున్నాయని, ఇటీవలే ఆనందపురంలో దళిత కుటుంబంపై తిరగబడిన ఘటనలో కేసు నడుస్తోందని శ్రీనివాసరావు చెప్పారు.

క్రికెట్ టోర్నీ నిర్వహణ అభినందనీయం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- 'సాక్షి'ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభం



బంతిని బలంగా బాదుతున్న బ్యాటర్



టోర్నీ ప్రారంభమ్యాచ్‌లో తలపడిన జట్లతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

విశాఖ స్పోర్ట్స్: యువతను ప్రోత్సహించేందుకు 'సాక్షి' మీడియా ఏటా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో 'సాక్షి'ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇదొక మంచి వేదిక అని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి.. ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. 'సాక్షి'బ్యూరో చీఫ్ రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆటగాళ్లకు ఫిట్‌నెస్ ముఖ్యమన్నారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. సర్క్యులేషన్ ఏజీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటా క్రికెట్ పోటీలతో పాటు సామాజిక బాధ్యతగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మేయర్ కాసేపు బ్యాటింగ్ చేసి ఆటగాళ్లలో ఉత్సాహం నింపారు. టాస్ వేసి పోటీలను ప్రారంభించి.. ప్రారంభ పోటీలో పాల్గొన్న ఇరు జట్లను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్‌మాల్ డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

తొలి రోజు విజేతలు వీరే..

సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) జూనియర్స్ విభాగం ప్రారంభ మ్యాచ్‌లో శ్రీకశ్యప్ జూనియర్ కళాశాల జట్టు 20 పరుగుల తేడాతో ఆళ్వార్‌దాస్ పాలిటెక్నిక్ జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కశ్యప్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. భరత్ 23, ఆర్.దుర్గాప్రసాద్ 22 పరుగులు చేశారు. విష్ణు రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా ఆళ్వార్‌దాస్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 72 పరుగులే చేసింది. బాలచంద్ర 27 పరుగులు చేశాడు.

- మరో మ్యాచ్‌లో ఎస్‌వీఎల్ఎన్ఎస్‌వీపీ(గోపాలపట్నం) కళాశాల జట్టు 18 పరుగుల తేడాతో ఏవీఎస్ పాలిటెక్నిక్ జట్టుపై విజయం సాధించింది. ఎస్‌వీఎల్ఎన్ఎస్‌వీపీ 75 పరుగులకు ఆలౌటైంది. ప్రతిగా ఏవీఎస్ పాలిటెక్నిక్ 57 పరుగులకే ఇన్నింగ్స్ ముగించింది. మురళి రెండు, సల్మాన్ మూడు వికెట్లు తీశారు.
- తొలి రోజు చివరి మ్యాచ్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్(కంచరపాలెం) జట్టు ఏడు వికెట్ల తేడాతో వీఎస్ కృష్ణా కళాశాల జట్టుపై విజయం సాధించింది. వీఎస్ కృష్ణా కళాశాల ఏడు వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. సురేష్ 30 పరుగులు చేశాడు. రిషి రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు మూడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. సాయిగణేష్ 40 పరుగులు చేశాడు.

District sponsor

CMR SHOPPING MALL The joy of life ANDHRAPRADESH | TELANGANA



విజేతలు వీరే.. శ్రీకశ్యప్ కళాశాల జట్టు



ఎస్‌వీఎల్ఎన్ ఎస్‌వీపీ కళాశాల జట్టు




ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

నేడు జాతీయ ఓటరు దినోత్సవం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ప్రజా ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటు హక్కు.. వజ్రాయుధం లాంటిది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు అనే బ్రహ్మాస్త్రంతో శాసించగలిగే హక్కును భారత రాజ్యాంగం మనకు కల్పించింది. ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనా వరకు ర్యాలీ నిర్వహించి.. అక్కడ సమావేశం నిర్వహించనున్నారు. ఓటర్ల జాబితా తయారీలో ప్రతిభ కనబరిచిన ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్(ఈఆర్‌వో), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారులు(ఏఈఆర్‌వో), బూత్ లెవల్ ఆఫీసర్ల(బీఎల్‌వో)లకు అవార్డులు ప్రదానం చేస్తారు. కాగా.. గత ఏడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో 18,95,918 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 9,47,833 మంది, పురుష ఓటర్లు 9,48,085 మంది ఉన్నారు. మొత్తం 1945 పోలింగ్ కేంద్రాలున్నాయి. 2022లో 18,80,773 మంది ఓటర్లు ఉండగా.. అందులో 9,42,231 మంది పురుషులు, 9,38,414 మంది మహిళలు, 128 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

'గైస్'కు అంతర్జాతీయ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు



కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీకి ప్రకటించిన అంతర్జాతీయ అవార్డు

మురళీనగర్ (విశాఖ ఉత్తర): అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్గనైజ్డ్ రీసెర్చ్ (ఐ2ఓఆర్) సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ఏటా ప్రకటించే అవార్డులకు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ఎంపికైంది. ఈ మేరకు అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థలకు అందించే "ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్" అవార్డును కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీకి (గైస్) ఆన్‌లైన్‌లో వర్చువల్ పద్ధతిలో మంగళవారం అందించారు. ఈ మేరకు వెబ్ బ్యానర్, అవార్డు సర్టిఫికెట్, మెమొంటో అందించారు. ఆ సంస్థ సీఈవో తన్వీర్ సింగ్ ఈ అవార్డును ఆన్‌లైన్‌లో ప్రకటించి అందించారు. ఇదే సంస్థ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఇటీవల అందించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ అవార్డును కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులకు అంకితం ఇస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర సాంకేతిక శాఖ కమిషనర్ సి.నాగరాణి సూచనల మేరకు, ముఖ్యమంత్రి జగనన్న నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కాలేజీని తీర్చిదిద్దాలనే ఆశయంతో పనిచేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 450 మందికి ఉద్యోగావకాశాలు కల్పించి రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందినట్టు ఆయన చెప్పారు.

బాలికలే దేశ అభ్యుదయానికి పునాదులు

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): బాలికలే దేశ అభ్యుదయానికి పునాదులని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద డీఎల్ఎస్ఏ కార్యదర్శి, జిల్లా జడ్జి కేకేవీ బులికృష్ణతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడారు. దేశానికి బాలికలే భవిష్యత్ అని, ఇంట్లో ఆడపిల్లలు ఉంటే ఆ ఇళ్లు స్వర్గంతో సమానమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యానికి ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అనంతరం డీఎల్ఎస్ఏ కార్యదర్శి, జిల్లా జడ్జి బులికృష్ణ మాట్లాడుతూ మహిళలు లేనిదే ఈ ప్రపంచం లేదని, ఆడపిల్లలే ఇంటికి వెలుగని, వారి సంరక్షణకు ఎన్నో చట్టాలున్నాయని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు మేయర్ బహుమతులు అందజేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎల్‌వీ రమణి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం' సందడి



రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం చిత్రయూనిట్

అల్లిపురం (విశాఖ దక్షిణ): రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం చిత్ర యూనిట్ మంగళవారం నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర యూనిట్ సభ్యులు, చిత్ర దర్శకుడు జయదీప్ విష్ణు మాట్లాడుతూ ఫిబవరి 3వ తేదీన వరల్డ్ వైడ్ అన్ని థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. వారధి క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రంలో హీరోలుగా ప్రవీణ్ ఖండేలా, శ్రీకాంత్ రాథోడ్, హీహీరోయిన్‌గా జయాత్రి మఖాన, శివరామ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు జయదీప్ విష్ణు మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని తమ చిత్రం ఆకట్టుకుంటుందన్నారు. దట్టమైన అడవుల్లో, పచ్చని పల్లెటూరి వాతావరణంలో అద్భుతమైన సీన్స్‌తో పాటు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే కామెడీ ట్రాక్ కటుంబ సమేతంగా చూడదగిన చిత్రమన్నారు. సంతోష్ మురారికర్ చిత్రానికి చక్కని కథను అందించారని, మణిశర్మ అద్భుతమైన సంగీతం సమకూర్చారన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాధవి

మహారాణిపేట: జిల్లా విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకురాలు(ఏడీ)గా పదవీ బాధ్యతలు చేపట్టిన జె.మాధవి మంగళవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల మాధవి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. దీంతో మాధవిని విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులుగా ప్రభుత్వం నియమించింది.

ఆడపిల్లలు స్వయం శక్తితో రాణించాలి

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : ఆడపిల్లలు స్వయం శక్తితో అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ సందర్భంగా అక్షర ఎడ్యుకేషన్ సొసైటీ, ఎంవీడీ హైస్కూల్, ఆరాధన చిల్డ్రన్ హోమ్ బాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకురాలు మాధవి, ప్రోగ్రాం డైరెక్టర్ వెంకటేశ్వరి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబరు రాధ, బాలల హక్కుల కమిషన్ మెంబర్స్ సీతారాం, హైమావతి, అనురాధ, మోకర రమేష్, ప్రసాద్, కార్పొరేటర్ నారాయణరావు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌లో డిఫెన్స్ సర్వీసెస్ అధికారులు



షిప్‌యార్డ్‌లో డిఫెన్స్ సర్వీసెస్ అధికారులు

సింథియా : ఇండస్ట్రియల్ అండ్ డిమాన్‌స్ట్రేషన్ టూర్‌లో భాగంగా వెల్లింగ్‌టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ అధికారులు (78వ స్టాఫ్ కోర్స్) మంగళవారం సింధియాలోని హిందూస్తాన్ షిప్‌యార్డ్‌ను సందర్శించారు. షిప్‌యార్డ్‌లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు పరిశీలించిన అధికారులు, షిప్ బిల్డింగ్, సబ్‌మెరైన్, షిప్ రిపేరులో చేపడుతున్న పనులు నాణ్యతను పరిశీలించి అభినందించారు.

ఆలస్యంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష?

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ డిజిటల్ అయాన్ పరీక్ష కేంద్రంలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే మంగళవారం ఉదయం సెషన్‌లో కొన్ని నిమిషాల ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైనట్లు సమాచారం. పైగా విద్యార్థులు, వారి సంరక్షకులతో పరీక్ష కేంద్రం ఆవరణలో చిన్నపాటి తోపులాట జరిగింది. దీంతో విద్యార్థులను పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించకుండానే లోపలకు అనుమతించారు. ఎందుకు పరీక్ష ఆలస్యమైందని నిర్వాహకులను విలేకరులు ప్రశ్నించగా.. సరైన సమాధానం ఇవ్వలేదు. మధ్యాహ్నం సెషన్‌లో తగు జాగ్రత్తలు తీసుకుని విద్యార్థులకు తనిఖీలు చేపట్టి.. లోపలకు పంపించారు.

సాంకేతికతతో మాట్లాడే సాయిబాబా విగ్రహం



సాయిబాబా విగ్రహాన్ని పరిశీలిస్తున్న అగనంపూడి సాయిబాబా మందిర కమిటీ

అగనంపూడి: రోబోటిక్స్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మాట్లాడే సాయిబాబా విగ్రహాన్ని మంగళవారం అగనంపూడి సాయిబాబా మందిర కమిటీ పరిశీలించింది. ఆరిలోవలో ఓ ఇంజినీర్, శిల్పి రవిచందర్ సాంకేతిక పరిజ్ఞానం జోడించి రోబో మాదిరిగా సాయిబాబా విగ్రహాన్ని రూపొందించారు. ఈ విగ్రహాన్ని హైదరాబాద్ తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కమిటీ ప్రతినిధులు కె.రమణారెడ్డి, డి.వ్యాసశర్మ, పి.సత్యనారాయణ, కె.అరుణ, డి.సత్యలక్ష్మి, జి.లీలావతి, పి.పంకజ ఈ విగ్రహాన్ని పరిశీలించారు. అగనంపూడి సాయిబాబా మందిరంలో ఇటువంటి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గల అవకాశాలపై చర్చించారు.

నిషేధిత ఇంజక్షన్లతో ఒకరి అరెస్ట్



నిషేధిత ఇంజక్షన్లతో నిందితుడు

అల్లిపురం(విశాఖ దక్షిణ): నిషేధిత పెంటాజోసిన్ ఇంజక్షన్లు కలిగి ఉన్న ఒకరిని టాస్క్‌ఫోర్స్, వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 490 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. జాలారిపేట, అగ్రహారంవీధిలో నిషేధిత పెంటాజోసిన్ ఇంజక్షన్లు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో వన్‌టౌన్ పోలీసుల సాయంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మంగళవారం దాడులు చేశారు. పూర్ణామార్కెట్ దరి వెలంపేటకు చెందిన గుంటు ఉమా మహేశ్వరరావు అలియాస్ పూర్ణామార్కెట్ మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 490 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకుని.. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఐ రేవతి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

భద్రతతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న డీటీసీ రాజారత్నం

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ప్రతి ఒక్కరూ రహదారి భద్రత పాటించాలని డీటీసీ రాజారత్నం కోరారు. రహదారి భద్రతా వారోత్సవాలు మంగళవారం సాగరతీరంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు వాక్‌థాన్‌ను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన దేశంలో ప్రతి ఏటా సుమారు 4.5 లక్షల ప్రమాదాలు జరుగుతుండగా, సుమారు 1.5 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జీఎస్టీ అదనపు కమిషనర్ రవి కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాన్ని నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీటు బెల్టు పెట్టుకోవటం, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి బయటపడొచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీవో జయప్రకాష్, మోటారు వాహనాలు తనిఖీ అధికారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి పాల్గొన్నారు.